## మంత్రి సీతక్కకు కార్మికుల వినతి


మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

ములకలపల్లి, డిసెంబర్ 26: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కకు మండలంలోని పంచాయతీ కార్మికులు గురువారం వినతిపత్రం సమర్పించారు. మండలంలో గురువారం సీతక్క పర్యటించారు. తమకు జీతాలు పెంచాలని, బకాయిలను విడుదల చేయాలని, పని భారం తగ్గించాలని కోరారు.

**పెద్దమ్మ గుడిలో పూజలు**

పాల్వంచ రూరల్, డిసెంబర్ 26: మండలంలోని పెద్దమ్మ గుడిని మంత్రి సీతక్క గురువారం దర్శించుకుని పూజలు చేశారు. ఆమె వెంట ఈవో రజనీకుమారి ఉన్నారు.

**సీతక్కకు సన్మానం**

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తున్న మంత్రి సీతక్కను ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం మండలంలోని బొజ్జాయిగూడెంలోని సమ్మక సారలమ్మ గద్దెల వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సత్కరించారు.

## ఆసుపత్రి భవనాల నిర్మాణం పరిశీలన


ఓపీ భవనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవిబాబు

అశ్వారావుపేట, డిసెంబర్ 26: స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలోగల భవనాలను డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు గురువారం పరిశీలించారు. ముందుగా, ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి, ఆర్ఎంవో డాక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీకేవోసీ 2 ఉద్యోగుల పనితీరు స్ఫూర్తిదాయకం


షీల్డ్, అవార్డు అందుకుంటున్న దృశ్యం

మణుగూరు టౌన్, డిసెంబర్ 26: టెక్నాలజీ వైజ్ బెస్ట్ పెర్ఫార్మింగ్ మైన్‌గా మూడోసారి ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్ 2కు అవార్డు లభించడం ఉద్యోగులు, అధికారుల అంకితభావ పనితీరుకు నిదర్శనమని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి అన్నారు. సింగరేణి సీఎండీ బలరాం, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణ సమక్షంలో రోలింగ్ షీల్డ్ అవార్డును ఓసీ2 ప్రాజెక్టు ఆఫీసర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ వెంట ప్రాజెక్టు ఇంజినీర్ వీరభద్రడు, మేనేజర్ సురేష్‌కుమార్, బేస్‌వర్క్‌షాప్ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి స్వీకరించడం హర్షణీయమన్నారు.

## ఆదివాసీలకు నిత్యావసరాలు, సోలార్‌లైట్లు పంపిణీ


నిత్యావసరాలు, సోలార్‌లైట్లు పంపిణీ చేస్తున్న దుమ్ముగూడెం పోలీసులు

దుమ్ముగూడెం, డిసెంబర్ 26: దుమ్ముగూడెం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నారాయణరావుపేట పంచాయతీ సిరిగుండం గొత్తికోయ గ్రామంలో ఆదివాసీ కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు, సోలార్‌లైట్లను సీఐ అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని, వలస ఆదివాసీల అభివృద్ధి కోసం ఇతర శాఖ అధికారులతో సమన్వయంతో పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. గ్రామప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకటప్పయ్య, గణేష్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.







# సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇండ్లు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దమ్మపేట, డిసెంబర్ 26: వచ్చే సంక్రాంతి నాటికి మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని నాచారం, గున్నేపల్లి పంచాయతీ కార్యాలయ నూతన భవనాలను గురువారం ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవనానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల మంది దరఖాస్తు చేశారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన జర్నలిస్టులకు మొదటి విడతలో ఇచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ... అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతం ఉన్నందున ఇక్కడ పేదలు ఎక్కుగానే ఉన్నారని చెప్పారు. ఈ నియోజకవర్గానికి ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని మంత్రి పొంగులేటిని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఆర్డీవో కాశయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్ కార్యాలయం తనిఖీ**

దమ్మపేట, డిసెంబర్ 26: దమ్మపేట తహసీల్ కార్యాలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

**వంతెన ప్రారంభం**

ములకలపల్లి, డిసెంబర్ 26: మండలంలోని పకీర్‌తండా సమీపంలోగల సజీవ్‌పల్లి శివారులో రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెనను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**బ్రిడ్జికి శంకుస్థాపన**

అశ్వారావుపేట, డిసెంబర్ 26: అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం గ్రామ సమీపంలో హైలెవెల్ బ్రిడ్జికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. నారంవారిగూడెం కార్యదర్శి సక్రమంగా పనిచేయడం లేదని అందిన ఫిర్యాదుపై స్పందించారు. ఆ కార్యదర్శిని తక్షణమే బదిలీ చేయాలని డీపీవో చంద్రమౌళిని ఆదేశించారు. వాగొడ్డుగూడెం ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మధును ఆదేశించారు. ఎంపీ రఘురాంరెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజమే లక్ష్యం


జెండా ఎగురవేసి మాట్లాడుతున్న సాబీర్‌పాషా

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 26: దోపిడీ రహిత సమాజ సాధనే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా కొత్తగూడెంలో గురువారం ప్రదర్శన జరిగింది. కూలీ లైన్ సూర్యోదయ పాఠశాల నుంచి ఎంజీ రోడ్, రైల్వే స్టేషన్, బస్టాండ్ సెంటర్ మీదుగా పోస్టాఫీస్ సెంటర్ వరకు ఈ ప్రదర్శన సాగింది. రెడ్ షర్ట్ వలంటీర్లు వందమంది జెండాలు చేబూని కవాతు చేశారు. పోస్టాఫీస్ సెంటర్‌లో పార్టీ పతాకాన్ని సాబీర్‌పాషా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాపోరాటాలతో సీపీఐ ఎదుగుతున్నదని అన్నారు. నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, దమ్మాలపాటి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ, డిసెంబర్ 26: పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్ తదితర ప్రాంతాల్లో సీపీఐ పతాకాలను నాయకుడు డాక్టర్ సూర్యదేవర రాంమోహన్‌రావు తదితరులు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీను, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

చండ్రుగొండ, డిసెంబర్ 26: సీపీఐ స్థానిక కార్యాలయం వద్ద జెండాను జిల్లా కమిటీ సభ్యుడు రామనాథం ఆవిష్కరించారు. ఆ తర్వాత నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన, జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల కార్యదర్శులు ఊకే నారాయణ., బొర్రా కేశవులు, నాయకుడు జడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 26: స్థానిక రింగ్ రోడ్డులోని సీపీఐ కార్యాలయం వద్ద ఎర్ర జెండాను రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ సలీమ్ ఆవిష్కరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రదర్శన నిర్వహించారు. గన్నిన రామకృష్ణ, జైనలాబ్దిన్, వగ్గెల అర్జునరావు, వెంకన్న, పఠాన్ జలాల్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు, డిసెంబర్ 26: ఇల్లెందులోని వివిధ ప్రాంతాల్లో ఎర్ర జెండాలను సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.సారయ్య ఆవిష్కరించారు. నాయకులు దేవరకొండ శంకర్, బందా నాగయ్య, ఉడత ఐలయ్య, నజీర్ అహ్మద్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు, డిసెంబర్ 26: స్థానిక సాయిబాబా ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు సీపీఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. నాయకులు గుండపిన్ని వెంకటేశ్వర్లు, చంద్ర నరేంద్రకుమార్, షేక్ చాంద్‌పాషా, నాగుల్‌మీరా, సొబ్బని సూర్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


టేకులపల్లి, డిసెంబర్ 26: టేకులపల్లిలో సీపీఐ పతాకాన్ని నాయకుడు గుగులోత్ రామచందర్ ఆవిష్కరించారు. మండల నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్


భద్రాచలం, డిసెంబర్ 26: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. నేడు, రేపు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించనున్న టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్మికులతో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో అరెస్టులు ఉండవని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి అధికారం చేపట్టాక అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు పంచాయతీ కార్మికులతో చర్చించి ఉద్యోగ భద్రతతో పాటు జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, నకిరికంటి నాగరాజు, పారెల్లి సంతోష్‌కుమార్, కాపుల రవి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీస్ అందజేత


సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

టేకులపల్లి, డిసెంబర్ 26: తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 27, 28 తేదీల్లో పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మెకు దిగనున్నారు. టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి దీప్తికి కార్మికులు గురువారం సమ్మె నోటీస్ ఇచ్చారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మూడ్ బిచ్చు, నాయకులు జినక ప్రసాద్, బానోత్ నాను, నజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## మను స్మృతి పోస్టర్ల దహనం


మను స్మృతి పోస్టర్లను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు, డిసెంబర్ 26: అసమానతల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మను స్మృతి పోస్టర్లను జై భారత్ బీసీ పోరాట వేదిక నాయకులు గురువారం ఇల్లెందులో దహనం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిమిశెట్టి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల మొక్కలు పంపిణీ


పండ్ల మొక్కలను నాటి మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, డిసెంబర్ 26: పెనగడప గ్రామంలో ఇంటింటికీ పండ్ల మొక్కల పంపిణీని సింగరేణి ఏరియా జీఎం శాలెంరాజు గురువారం ప్రారంభించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ... సింగరేణి ప్రభావిత గ్రామాల్లో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. గ్రామంలో అతి త్వరలోనే గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులు కోటిరెడ్డి, డేవిడ్ అభిలాష్, ఎం.శ్రీరమేష్, వెంకటేశ్వరరావు, కార్మిక నాయకులు గట్టయ్య (ఏఐటీయూసీ), ఎండీ రజాక్ (ఐఎన్‌టీయూసీ) తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఈజీఎస్ ఓపెన్ ఫోరం


ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: ఈజీఎస్ సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ధన్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ కార్యాలయంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న వైద్యురాలు డాక్టర్ లోహిత

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: క్షయ వ్యాధితో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ లోహిత అన్నారు. మండలంలోని కొమరారం పంచాయతీ ఒడ్డుగూడెం, నాయకులగూడెంలో గురువారం క్షయ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మినప్పుడు సూక్ష్మ క్రిములు నేరుగాగానీ, గాలి ద్వారాగానీలో ఇతరులకు సోకుతాయని, వ్యాధిని వ్యాపింపజేస్తాయని వివరించారు. అలసట, తల నొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని చెప్పారు. ఇలాంటివి కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు.

## శ్మశాన వాటికకు వెళ్లేదెలా..?


ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

చండ్రుగొండ, డిసెంబర్ 26: చండ్రుగొండలోని అంబేద్కర్ కాలనీ వాసుల శ్మశాన వాటికకు దారి చూపాలని డిమాండ్ చేస్తూ వివిధ సంఘాలు, పార్టీల నాయకులు గురువారం ఆ శ్మశాన వాటిక వద్ద ఆందోళన చేశారు. అధికారులు ఇకనైనా దారి చూపకపోతే జనవరిలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తంబర్ల రవి, గుగులోత్ శ్రీనివాస్ నాయక్, కొడెం నాగేశ్వరరావు, వారాది సత్యనారాయణ, విజయలక్ష్మి, చాపలమడుగు వెంకటేశ్వర్లు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 26: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి బేతంపూడి దర్గా ఉర్సు


ముస్తాబైన దర్గా

టేకులపల్లి, డిసెంబర్ 26: మండలంలోని బేతంపూడి హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బాబా ఉర్సు షరీఫ్ నేడు (శుక్రవారం) ప్రారంభమవుతుంది. శనివారం వరకు కొనసాగుతుంది. శుక్రవారం రాత్రి 8.00 గంటలకు గంధం సిమాలిక్ పాన్ షాప్ నుంచి ర్యాలీతో గంధం బయలుదేరి, బేతంపూడి దర్గాకు చేరుతుంది.

## నేటి నుంచి తాగునీటి సరఫరా బంద్

మణుగూరు టౌన్, డిసెంబర్ 26: మణుగూరు మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటిని అందించే చిన్నరావిగూడెం ఇంటెక్ వెల్‌లో సిల్టు తొలగింపు పనుల చేపట్టనున్నారు. రానున్న వేసవికాలం దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా పనులు నిర్వహించనున్నందున ఆదివారం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని మున్సిపాలిటీలోని ప్రజలు గమనించి సహకరించాలని కమిషనర్, అసిస్టెంట్ ఇంజినీర్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ, డిసెంబర్ 26: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నట్లు, ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మార్కెట్, శ్రీనివాస కాలనీ, టీచర్స్ కాలనీ, గాంధీనగర్, ఒడ్డుగూడెం, పేట చెరువు, శ్రీనగర్, కరకవాగు, సీతారాంపట్నం తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సీఎం కప్ పోటీలకు పయనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు గురువారం ప్రత్యేక బస్సులో హైదరాబాద్ పయనమయ్యారు. వీరి బస్సును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీవైఎస్‌వో పరంధామరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి


దమ్మపేట, డిసెంబర్ 26: మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు పిల్లి నాయుడు, పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాసరావు, రావుల శోభన్‌బాబు, మోరంపూడి కేశవరావు, కొప్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ అశోక్

దుమ్ముగూడెం, డిసెంబర్ 26: క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, యువత క్రీడల్లోనూ రాణించాలని దుమ్ముగూడెం సీఐ బి.అశోక్ అన్నారు. గురువారం ములకపాడు క్రీడామైదానంలో దుమ్ముగూడెం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, వైద్యులు రుక్మాకర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రఘు, హరికృష్ణ, కామేష్, రాము, బాధ్యులు హేమంత్, చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతల ఫ్లెక్సీలు ధ్వంసం



గుర్తుతెలియని వ్యక్తులు చింపి, కాల్చిన ఫ్లెక్సీలు

బూర్గంపహాడ్, డిసెంబర్ 26: బీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు పంచాయతీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి ధ్వంసం చేశారు. ఫ్లెక్సీలను ఇలా గుర్తుతెలియని కాల్చడం, ధ్వంసం చేయడం తగదని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. గిట్టని పార్టీ నాయకులే ఇలాంటి ఘటనలకు పాల్పడి ఉంటారని బీఆర్ఎస్ నాయకులు అనుమానం వ్యక్తం చేశారు.